


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మజిలీ

**స్రవంతి తలుపు** తాళం తీసి, తలుపుని లోపలికి తీసి చెప్పింది.

"రండి"

రాఘవ ఆమె వెనకే ఇంట్లోకి అడుగుపెట్టాడు. అంతకు ముందు అనేకసార్లు ఆ ఇంటికి వచ్చినా ఈసారి ఎందుకో ఆయనకి మొహమాటంగా అనిపించింది.

ఆమె ఆయన సూట్‌కేస్‌తో గుమ్మంకి ఎడమవైపున్న గదిలోకి వెళ్తూ చెప్పింది.

"ఇటురండి."

రాఘవ మౌనంగా అటు వెళ్ళాడు.

"మీకు ఈ గదిని కేటాయించడానికి రెండు కారణాలు. సిద్దూ మీరు ఎప్పుడూ వాడుకునే గదిని తీసుకున్నాడు. రెండో కారణం, ఈ కిటికీలోంచి మీకు ముందు రోడ్డు, వచ్చేపోయేవాళ్ళు కనిపిస్తూంటారు. అదో కాలక్షేపం" చెప్పింది.

ఆమె చెప్పని మూడో కారణం రాఘవకి తెలుసు. ఆ గది తన భార్య కళని గుర్తుకు తెస్తుంది. ఆయనకి హఠాత్తుగా భార్య మీద కోపం వచ్చింది. 'నా గురించి ఆలోచించకుండా అలా వెళ్ళిపోవడమే' అనుకున్నాడు.

స్రవంతి కాఫీ కప్పుతో వచ్చి చెప్పింది.

"స్నానం చేసి చకచకా వంట చేసేస్తాను. మీకు భోజనానికి ఓ గంట ఆలస్యమవచ్చు."

"పర్లేదమ్మా" గొంతు పెకల్చుకుని చెప్పాడు.

కాఫీ తాగుతూ ఆ గదిని చూసాడు. పెద్దమంచం. నీట్‌గా వేసిన దుప్పటి రెండు దిండ్లు, పక్కన ఒక సైడ్ టేబుల్. వీధివైపు పెద్ద కిటికీ. దానిముందు దాని ఎత్తుకి సరిపడే ఒక చిన్న సింగిల్ సోఫా. మరో గోడకి తలుపులున్న అల్మైరా, అటాచ్‌డ్ బాత్‌రూం అంతే. ఆ గదిలో మరో వస్తువులేదు. ఇదివరకు తామున్న గదిలో కూడా అంతే. కళకి అసంతృప్తిగా ఉండేది. "అబ్బాయ్ అంత పెద్ద మేనేజర్. ఇంట్లో చూస్తే ఏ వస్తువూ ఉండదు. అదేమంటే ఆవిడగారు 'నేను మినిమలిస్ట్‌ని.

అవసరానికి మించిన వస్తువులుంటే నాకు ఇల్లు ఇల్లులా ఉండదు, మ్యూజియంలాగా ఉంటుంది' అంటుంది. పిసినారితనానికి ఫేషన్ పేరు మినిమలిస్ట్" అని సణుగుతూండేది.

ఆయనకి మరోసారి భార్య మీద కోపం వచ్చింది.

రాఘవకి ఒక్కడే కొడుకు. అతను స్రవంతిని ప్రేమించానని, పెళ్ళంటూ చేసుకుంటే ఆమెనే చేసుకుంటానని పట్టుబట్టడంతో ఆమెతో పెళ్ళయితే చేసారు కాని అసంతృప్తిని దాచుకోలేదు. ఆ ఇల్లు స్రవంతిదే. ఆమె డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడు సెకండ్‌షో సినిమాకి వెళ్ళిన తల్లితండ్రులు ఏక్సిడెంట్‌లో పోయారు. ఆమె ధైర్యంగా అదే ఇంట్లో ఉంటూ, తండ్రి ఆఫీస్ వాళ్ళిచ్చిన డబ్బుని జాగ్రత్తగా ఖర్చు చేసుకుంటూ చదువు ముగించి ఉద్యోగంలో చేరింది. అత్తమామలు లేని సంబంధం, తన కొడుక్కి అచ్చట ముచ్చట తీరవని కళకి కోపంగా ఉండేది. పెళ్ళయ్యాక కొడుకు కూడా కోడలి ఇంటికి మారిపోవటంతో ఆ ఇంటికి రావడం ఆవిడకి ఇష్టం ఉండేది కాదు. కొడుకు కోసం తప్పక వచ్చినా, స్రవంతితో చనువుగా ఉండేది కాదు. ఒక్క పనీ చేసేదికాదు. రాఘవ కూడా నిర్లిప్తంగా ఉండేవాడు తప్ప కల్పించుకునేవాడు కాదు.

ఏడాది కిందట కళ అకస్మాత్తుగా గుండెనొప్పితో నిద్రలోనే పోయింది. విషయం తెలిసిన కొడుకూ కోడలు వచ్చి పదిరోజులు అన్ని కార్యక్రమాలు నిర్వర్తించారు. పన్నెండో రోజు కొడుకు చెప్పాడు.

"రేపు వెళ్ళిపోదాం నాన్నా."

"ఎక్కడికిరా?" రాఘవ అడిగాడు.

"ఎక్కడికేంటి నాన్నా. మాతో మనింటికి" రవి సహనంగా చెప్పాడు.

ఆయన స్రవంతివైపు చూసాడు. ఆమె ఈ సంభాషణ వినడంలేదు. పనివాళ్ళతో సామాను సర్దిస్తోంది.

"నన్ను వంటరిగా ఉండనివ్వు రవీ. కొన్ని రోజులు మీ అమ్మ జ్ఞాపకాలతో బతకాలని ఉంది" బలహీనంగా చెప్పాడు.

"భలేవాడివి నాన్నా. అక్కడికి వస్తే అమ్మని మర్చిపోతావా? మరి నువ్వొక్కడివే ఉంటే నేను ప్రశాంతంగా వర్క్ చేసుకోలేను. ప్లీజ్ నాన్నా" అర్థించాడు.

"చూద్దాం. ఎన్నాళ్ళు వీలైతే అన్నాళ్ళు ఉంటాను. బలవంతం చేయద్దు రవీ"

ఇక అతనేం మాట్లాడలేదు. చుట్టపక్కాలంతా వెళ్ళిపోయాక రాఘవకి అసలైన వంటరితనం అంటే ఏమిటో అర్థమైంది. కళ వాగుడుకాయ. ఆయన విన్నా వినకపోయినా ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉండేది. సమయానికి అన్నీ అమర్చి పెట్టేది. అలాంటి మనిషి చెప్పకుండా మాయమవడంతో రాఘవకి తనేం కోల్పోయాడో ఐదారునెలలకి పూర్తిగా తెలిసింది. భోజన ప్రియుడు కాకపోవడంతో ఆ విషయంలో ఇబ్బంది పడలేదు. కానీ వంటరితనానికి అలవాటు పడలేకపోయాడు.

రవి నెలకోసారి వచ్చి చూసి వెళ్ళేవాడు. ప్రతిసారీ అడిగేవాడు.

"నా దగ్గరకి వచ్చెయ్ నాన్నా"

ఆయన మౌనంగా ఊరుకునేవాడు.

రెండు నెలల క్రితం రవి వచ్చి చెప్పాడు.

"ప్రాజెక్ట్ పనిమీద జర్మనీ వెళ్తున్నా నాన్నా. రెండేళ్ళు."

"రెండేళ్ళా?"

"అవును. స్రవంతి రావడంలేదు. సిద్దూ చదువుకి ఇబ్బంది. అక్కడ స్కూల్స్‌లో జర్మన్ భాష కదా."

"ఒక్కడివే వుంటావా నాన్నా?" ఆయన బాధగా అడిగాడు.

"నువ్వుండటం లేదా నాన్నా?"

ఆయనేం మాట్లాడలేదు. రవి వెళ్ళిపోయాడు. ఇండియాలో ఉన్నప్పటిలాగే రోజులో ఒక్కసారైనా తండ్రితో మాట్లాడతాడు. కాని రాఘవకి అధైర్యం వచ్చింది. కళ పోయింది అనగానే వెంటనే కొడుకు వచ్చాడు. తనకేమైనా అయితే రాలేడు. సెలవు, టిక్కెట్లు విమానాలు ఎన్ని చూసుకోవాలి? తనకి అనాథ చావు రాసిపెట్టుందేమో అనుకునేవాడు.

వారం క్రితం రవి ఫోన్ చేసి ఎప్పట్లాగే అడిగాడు.

"నాన్నా. ఎలా ఉన్నావు?"

"ఏంటోరా అబ్బాయ్. పెద్దగా బాలేను" ఆయన కంపిస్తున్న స్వరంతో చెప్పాడు.

"అయ్యో! ఏమైంది? బిపి పెరిగిందా?" రవి ఆదుర్దాగా అడిగాడు.

"ఏమో! ఈ మధ్య చూపించుకోలేదు. సరే ఉంటా. పనిచేసుకో" ఆయన ఫోన్ పెట్టేసాడు.

మర్నాడు ఉదయం ఆరుగంటలకే తలుపు చప్పుడైంది. 'ఇంత పొద్దున్నే ఎవరొచ్చారు?' అనుకుంటూ తలుపు తెరిచాడు. ఎదురుగా స్రవంతి. పక్కకి తప్పుకున్నాడు. ఆమె లోపలకి వచ్చి మామగారి చెయ్యి పట్టుకుని చూసింది. జ్వరంలేదు.

ఎన్నో రోజుల తర్వాత తాకిన ఆ మనుష్య స్పర్శకి ఆయన కొద్దిగా చలించాడు.

"జ్వరంలేదు. కానీ చాలా నీరసంగా ఉన్నారు. స్వంత వంట. సరిగ్గా తింటున్నట్లు లేదు." స్రవంతి ఇంట్లోని అన్ని కిటికీలు, తలుపులు బార్లా తెరిచింది.

"మీరు బయటకి వస్తున్నట్లు లేరు. పేల్‌గా కనిపిస్తున్నారు. డి విటమిన్ తగ్గి ఉంటుంది. బయట అరుగుమీద కొద్దిసేపు కూర్చోండి. ఎండ తగలనివ్వండి" ఆయన చేతిని పట్టుకుని తీసుకెళ్ళి బయట కూర్చో పెట్టింది.

ఎన్నడూ కోడలితో మాట్లాడని రాఘవ ఇప్పుడేం మాట్లాడో తెలియక తబ్బిబ్బవుతున్నాడు.

"సిద్దూ. వాడెలా ఉన్నాడు? తీసుకురాలేదే?" తడబడుతూ అడిగాడు.

"బానే ఉన్నాడు. స్కూలుందిగా రాలేదు. ఐనా మీరే వస్తారుగా" నవ్వేసింది.

"నేనా?"

"అవును. ఈ రెండు రోజులు మా ఫ్రెండ్ ఇంట్లో ఉంటాడు. మనం వెళ్ళాక ఇంటికి వస్తాడు"

"అబ్బాయ్ లేకుండా అక్కడికి రావాలా?" గొణిగాడు.

స్రవంతి గుమ్మంమెట్లమీద కూర్చుని మృదువుగా చెప్పింది.

"నిన్న మీరు డల్‌గా మాట్లాడారట. రవి బెంగపడిపోయాడు. 'తక్షణం వెళ్ళి నాన్నని మనింటికి తీసుకురా' అని చెప్పాడు. అందుకే వెంటనే వచ్చేసాను. ఇంకేం మాట్లాడకండి."

కొడుకుతో మాట్లాడినట్లుగా కోడలితో వాదించలేకపోయాడు.

స్రవంతి చకచక ఇంట్లోని సామానంతా సర్దేసింది. పాత దుప్పట్లు, అత్తగారి చీరలని వాటిమీద కప్పింది. మిగిలిపోయిన ఉప్పు, పప్పులని పనిమనిషికి ఇచ్చేసింది. ఆ రెండురోజులు హోటల్‌నించి భోజనం తెప్పించింది. రాఘవ మౌనంగా జరిగేది చూస్తూండిపోయాడు. రెండోరోజు సాయంత్రం రాఘవ వస్తువులున్న రెండు సూట్‌కేస్‌లతో రైలెక్కారు. ఈ రెండు రోజుల్లో కోడలితో నాలుగైదు వాక్యాలు మినహా మాట్లాడలేదు రాఘవ.

"మామయ్యా! మీరు స్నానం చేసేస్తే తినేద్దాం" స్రవంతి వంటగదిలోంచి చెప్పింది. రాఘవ ఖాళీ కాఫీ కప్‌ని హాల్లోని డైనింగ్ టేబుల్ మీద పెట్టాడు.

"గీజర్ ఆన్‌లోనే ఉందండి. లెఫ్ట్ సైడ్‌ది వేడ్నీళ్ళ పంపు, రైట్‌ది చన్నీళ్ళు" చెప్పింది.

భోజనాలయ్యాక అడిగింది.

"మీరు రెస్ట్ తీసుకోండి. నాకు కొంచెం ఆఫీస్ పనివుంది. చేసుకుంటాను. మధ్యాహ్నం మీరేం తాగుతారు? కాఫీనా? టీనా?"

"టీ. నువ్వు ఆఫీస్‌కి వెళ్తున్నావా" అడిగాడు.

"లేదు. ఇంట్లోంచి పని చేస్తానని చెప్పాను" స్రవంతి లేప్‌టాప్‌ని డైనింగ్ టేబుల్ మీద ఉంచి చెప్పింది.

రాఘవ తనకి కేటాయించిన గదిలోకి వెళ్ళిమంచం మీద వాలాడు. ప్రయాణపు అలసట ఉన్నా, మానసికంగా ఎందుకో భద్రతని ఫీలవడంతో చాలారోజుల తర్వాత హాయిగా నిద్రపోయాడు.

రాఘువకి మెలకువ వచ్చేసరికి ఐదవుతోంది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. లేచి బాత్‌రూంలోకి వెళ్ళొచ్చాడు. ఆ చప్పుడికి గదిలోకి వచ్చి సిద్దూ చెప్పాడు.

"హలో తాతా"

వాడిని పొదవి పట్టుకుని రెండు బుగ్గల మీద ముద్దుపెట్టుకుని చెప్పాడు.

"నాన్నా బాగున్నావా? పొడుగయ్యావోయ్."

"సిద్దూ" తల్లి పిలుపు విని బయటకి వెళ్ళిన వాడు నిమిషంలో వచ్చి అడిగాడు.

"తాతా! టీ ఇక్కడికి తేవాలా? నువ్వు అక్కడికి వస్తావా?"

"వస్తాలే పద" వాడి భుజం మీద చెయ్యివేసి బయటకి నడిచాడు.

డైనింగ్ టేబుల్ మీద తను తినే బిస్కెట్లు, టీ కప్పు చూసి, కోడలివైపు చూసాడు. ఆమె కీ బోర్డ్ మీద టకటక వేళ్ళతో కొడుతోంది. ఆయన తనవైపు చూడటంతో ఆయనవైపు చూసి నవ్వింది.

సిద్దూతో మాట్లాడుతూ ఆయన టీలో బిస్కెట్లు ముంచుకుని తిన్నాడు.

"టీ చల్లారిపోయివుంటుంది. ఇంకో కప్పు ఇవ్వనా?" స్రవంతి అడిగింది.

"ఇప్పుడు వద్దులెమ్మ. గంటాగి తాగుతా" చెప్పాడు.

సిద్దూ పుస్తకాల బేగ్‌తో వచ్చి చెప్పాడు.

"తాతా. పద. హోం వర్క్ చేసుకుందాం."

ఇద్దరూ తలుపు తీసుకుని ఇంటిముందున్న చిన్నతోటలోకి వచ్చారు. ఒక మల్లెతీగ, మరో జాజి తీగ తప్ప అన్నీ కూరగాయల మొక్కలే ఉన్నాయి. ఆయనకి కళ గుర్తొచ్చింది. 'చక్కగా గులాబీలు, మందారాలులాంటి పూలమొక్కలు వేసుకుంటే పూజకి పనికొస్తాయి. వంకాయ, బెండకాయ, నా తలకాయ తప్ప పూలు లేవు, మొగ్గలు లేవు' సాధించేది. స్రవంతి నవ్వుతూనే సమాధానం చెప్పేది.

"నాది గోరాగారి పాలసీ అత్తయ్య. తినడానికి పనికొచ్చేవి పెంచాలి కాని, అందానికికాదు. మనతోటలో వంకాయలు, బెండకాయలు వండుకుంటే ఎంత బాగుంటుంది"

"పిసినారి" కళ మెటికలు విరిచేది.

మునుపటి అలవాటు ప్రకారం రాఘవ తోట మధ్యలో ఉన్న అరుగుమీద కూర్చున్నాడు. సిద్ధూ బేగ్ తెరిచి పుస్తకాలు బయటకి తీసాడు. తాత సహాయంతో హోం వర్క్ పూర్తిచేసి, పుస్తకాల బేగ్ భుజానేసుకుని చెప్పాడు.

"థాంక్స్ తాతా! నేను ఆడుకోడానికి వెళ్తాను."

వాడు బేగ్‌ని ఇంట్లో పెట్టి, గేటు తెరచుకుని ఆడుకోడానికి బయటకి వెళ్ళిపోయాడు. రాఘవ అరుగు మీద వంటరిగా మిగిలిపోయాడు.

స్రవంతి చేతిలో రెండు టీ కప్పులతో వచ్చి ఆయనకి ఒకటిచ్చి అడిగింది.

"మీకు గార్డెనింగ్ మీద ఇంట్రెస్ట్ ఉందా?"

"పల్లెటూరి వాళ్ళకి ఎవరికైనా ఉంటుందేమో?"

"ఐతే టీ తాగాక మనం కలుపుమొక్కలు పీకేసి మొక్కలకి నీళ్ళు పడదామండి. రెండురోజులు లేకపోవడంతో పాపం నోళ్ళు తెరచుకుని ఉన్నాయి" చెప్పింది.

'కళతో వచ్చినప్పుడు ఏ పనిచేసేది కాదు. చేయనిచ్చేదికాదు. మనవడికి హోం వర్క్‌లో సహాయం చేసేవాడంతే. ఇప్పుడు కళలేకపోవడంతో ఈ అమ్మాయి పనిచేయిస్తోంది. రవి ఎప్పుడో వస్తాడో' ఆయనకి దిగులుగా అనిపించింది.

"మీ వయసు డెబ్బైదాకా ఉంటుందా?" అడిగింది.

"అరవై నాలుగు."

"అంతేనా? మీరు చాలా పెద్దగా కనిపిస్తున్నారు. పోషణ లేక అనుకుంటాను. పొద్దున్నే ఇద్దరం వాకింగ్‌కి వెళ్దాం. సాయంత్రం తోటపని చేద్దాం. మీకు ఏ వ్యాపకం ఎక్కువ ఇష్టం? పుస్తకాలు చదువుతారా? సినిమాలు, టి.వి చూస్తారా? బొమ్మలు గీస్తారా?" అడిగింది.

"ఇష్టాలు తక్కువమ్మా. ఉద్యోగం చేసే రోజుల్లో, ఆఫీస్ లైబ్రరీలో ఇంగ్లీష్ నవలలు తెచ్చి చదివేవాడ్ని. రిటైరయ్యాక ఆ అలవాటు పోయింది. కళ టి.వి పెట్టేది. అదే చూసే వాడిని. కళపోయాక అదీలేదు" నిట్టూర్చాడు.

"ఏదో వ్యాపకం లేకపోతే కాలం గడవడం కష్టం మామయ్యా. పాటలు వింటారా?"

"ఆఁ తక్కువ"

ఆ తర్వాత చీకటి పడేదాకా ఇద్దరూ తోటపని చేసారు. వెలుగుండగానే స్రవంతి కొన్ని బెండకాయలు, పచ్చిమిరపకాయలు, టొమేటోలు కోసింది. ఆయన మొక్కల పెంపకంలో తనకి తెలిసిన చిట్కాలు చెప్పాడు.

ఆటలనించి సిద్ధూ తిరిగి వచ్చాక ఇంట్లోకి నడిచారు. రాఘవ స్నానం చేసి వచ్చి మనవడికి కాసేపు చదువు చెప్పాడు.

"మీ నాన్న లేకపోతే దిగులుగా లేదబ్రా? నీకు జర్మన్ భాష వచ్చేది. వెళ్ళుండాల్సింది" మనవడితో చెప్పాడు.

"అక్కడ ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో ఇంగ్లీషేట తాతా. కాని నాన్నే అమ్మని ఇక్కడే ఉండమన్నాడు. అమ్మ ఆఫీస్ వాళ్ళు అక్కడ పోస్టింగ్ ఇస్తామన్నారు కూడా."

"అవునా? ఎందుకు?" ఆయన నిర్ఘాంతపోయాడు.

"మేమంతా వెళ్ళిపోతే నువ్వు ఒక్కడివే అయిపోతావన్నాడు నాన్న. అమ్మ 'నిజమే నువ్వు వెళ్ళు రవీ' అని చెప్పింది" సిద్ధూ చెప్పాడు.

ఆయనకి ఎందుకో గిల్టీగా అనిపించింది.

పిసినారిగా పేరుబడ్డ స్రవంతి యూరోల సంపాదన వదులుకుంది. భర్తకి దూరంగా ఉంటోంది.

"మామయ్యా మీరు రాత్రిళ్ళు అన్నం తింటారా? చపాతీలా?" స్రవంతి అడిగింది.

"మీరేం తింటే అదే తింటా ప్రత్యేకతలేం లేవు."

"సరే. మేం అన్నమే తింటాం. పొద్దుటి ఐటెమ్స్ ఓకే కదా?"

"పర్లేదమ్మా. తింటాను."

ఆయనకి ఆమెకి ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియడంలేదు. మామగారి కోసం ఎంతమంది కోడళ్ళు విదేశీ కాపురం వదులుకుంటారు?

రవి ఫోన్ చేసాడు.

"నాన్నా. అంతా సౌకర్యంగానే ఉందా? ఇబ్బందేం లేదుగా?"

"లేదు నాన్నా. రేపు అమ్మాయి ఆఫీస్‌కి వెళ్తుందేమో. వంటింట్లో వస్తువుల గురించి తెలుసుకుంటే చాలు. టీ పెట్టుకోడంలాంటివి చేయాలిగా" చెప్పాడు.

"అవసరంలేదు నాన్నా. స్రవంతి నేను వచ్చేదాకా ఇంటినించే పనిచేస్తుంది. వాళ్ళ ఆఫీసువాళ్ళు ఒప్పుకున్నారు. మరీ ఏదైనా ప్రాబ్లం ఉంటే, ఓ రెండు గంటలు వెళ్ళొస్తుంది అంతే" రవి చెప్పాడు.

"అయ్యో! నాకోసం..." ఆయనకి మాటలు రాలేదు.

"నువ్వలా ఆలోచించకు నాన్నా. మనమంతా ఒక ఫేమిలీ" కొడుకు ఫోన్ పెట్టేసాడు.

భోజనాలు అయ్యాక రాఘవ కోడలితో చెప్పాడు.

"అమ్మాయ్! నాకోసం జర్మనీ వదులుకున్నావు. ఆఫీస్‌కి వెళ్ళకుండా ఇంట్లోనే పనిచేస్తున్నావు. నా గ్రాటిట్యూడ్‌ని ఎలా.."

"...అయ్యో అలా అనకండి మామయ్యా" స్రవంతి అడ్డు తగిలింది.

"నిజంగా నేను చాలా ఫీలవుతున్నాను. కళ పోయినప్పుడే మీతో వచ్చి ఉండాల్సింది. ఏంటో అర్థంలేని భయాలతో రాలేదు" ఆయన తలదించుకున్నాడు.

"మా నాన్నయితే చేయనా? ఆయనకా అదృష్టం లేక అర్ధాయుష్కుడిగా పోయారు. రవి నాన్న నాకూ నాన్నలాంటివారే. ఇంతకాలం మనం మాట్లాడుకోకుండా ఉండచ్చుకాని ఇకనించి కబుర్లు చెప్పుకుందాం. రవి చిన్నప్పుడు ఎలా ఉండేవాడు, అతని బాల్యం, అత్తయ్య, మీ కుటుంబం, మీ ఉద్యోగం.. వీటన్నిటి గురించి మీరు నాకు బోలెడు కబుర్లు చెప్పాలి" స్రవంతి గలగలా నవ్వుతూ చెప్పింది.

కృతజ్ఞతతో రాఘువ కళ్ళు తడిసాయి.

తెల్లవారు ఝామున ఐదు గంటలకి స్రవంతి గది తలుపు మీద తట్టాడు రాఘవ.

"అమ్మా వాకింగ్‌కి నేను రెడీ. నువ్వు తయారైతే వెళ్ళొద్దాం" ఉత్సాహంగా చెప్పాడు.

"ఐదు నిమిషాలు మామయ్య" స్రవంతి అరిచింది.

"అలాగే ఈరోజు నీకు మా నాయనమ్మ గురించి చెప్పాలి. ఎంత గయ్యాళి అనుకున్నావ్."

"ఆయన ఇంటి తలుపు తెరిచాడు. కనుచీకటిలో నిర్మానుష్యంగా ఉన్న వీధి, పసరువాసన వేస్తోన్న మొక్కలు, కొంచెం ఎర్రబడుతున్న తూర్పు దిక్కు.. రాఘువకి భవిష్యత్తు ఆశాజనకంగా, నిశ్చింతగా కనిపిస్తోంది.

'మనం మూర్ఖత్వంతో చాలా మిస్సయ్యాం కళా' అనుకున్నాడు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments